సాక్షి
అనంతపురం
శుక్రవారం । 2 । మే । 2025



టన్ను చీనీ రూ.22 వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.22 వేలు, కనిష్టంగా రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.



టెంకాయ చెట్టుపై పిడుగు
ఉరవకొండ: వజ్రకరూరు మండలం ఛాయాపురంలో బుధవారం రాత్రి భాస్కర్ ఇంటి ఆవరణలో ఉన్న టెంకాయ చెట్టుపై పిడుగు పడటంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి.

గరిష్టం/కనిష్టం
42.1°/23.8°
జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం అధికంగా కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

'పది'టాపర్స్‌కు విమానయానం



బెళుగుప్ప మండల టాపర్స్‌ను అభినందిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బెళుగుప్ప: పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించి మండల స్థాయిలో టాపర్స్‌గా నిలిచిన ఐదుగురు విద్యార్థులకు విమానం ఎక్కే అవకాశం దక్కింది. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో ఎంఈఓ మల్లారెడ్డి తన సొంత నిధులతో విమానయాన అవకాశం కల్పిస్తానని గతంలోనే హామీ ఇచ్చారు. ఈ మేరకు మండల టాపర్స్‌గా నిలిచిన వై.ఈశ్వరి (574), టీ.మధుశ్రీ (568), జీ.ఫాజియా (563), సి.లావణ్య (560), కె.అర్చన (556)లను బెంగళూరు నుంచి విమానంలో హైదరాబాద్‌కు తీసుకువెళ్లి అక్కడ పర్యాటక ప్రాంతాలను చూపించనున్నారు. ఇందుకోసం గురువారం రాత్రే ఎంఈఓ మల్లారెడ్డి విద్యార్థులను తీసుకుని బెంగళూరుకు వెళ్లారు. అంతకుముందు ఆయన మండల టాపర్స్‌తో కలిసి కలెక్టర్ వినోద్‌కుమార్, ఇన్‌చార్జ్ డీఈఓ కృష్ణయ్యలను కలిశారు. విద్యార్థుల కుటుంబ నేపథ్యం, సాధించిన మార్కులను వివరించారు. కలెక్టర్ వినోద్‌కుమార్ విద్యార్థులను అభినందించారు.

పింఛన్ సొమ్ముతో ఉడాయించిన డిజిటల్ అసిస్టెంట్

- ఎంపీడీఓ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు

బెళుగుప్ప: లబ్ధిదారులకు ఇవ్వాల్సిన పింఛన్ మొత్తంతో ఓ సచివాలయ ఉద్యోగి పరారు కాగా పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే... బెళుగుప్ప-1 సచివాలయంలో ఉపేంద్ర డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. మే నెలకు సంబంధించి తన పరిధిలోని 61 మంది పింఛన్‌దారులకు ఇవ్వాల్సిన రూ.2.76 లక్షలను గురువారం ఉదయం తీసుకున్నాడు. కేవలం ముగ్గురికి మాత్రం పింఛన్ పంపిణీ చేసి కనిపించకుండా పోయాడు. అతని సెల్‌ఫోన్ స్విచాఫ్ వస్తుండటంతో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, సచివాలయ సెక్రటరీ శివరంజని పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.2.58 లక్షల సొమ్ముతో ఉపేంద్ర కనిపించకుండా పోయాడంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివ తెలిపారు.

కరెంటు బిల్లు కట్టడం ఇక ఈజీ

- బిల్లులోనే క్యూఆర్ కోడ్
- స్కాన్ చేసి పేమెంట్ చేసే అవకాశం
- ఉమ్మడి 'అనంత'లో ఈ నెల నుంచి ప్రయోగాత్మకంగా అమలు



విద్యుత్ బిల్లులోనే వచ్చిన క్యూఆర్ కోడ్

అనంతపురం టౌన్: విద్యుత్ బిల్లుల చెల్లింపుల్లో వినియోగదారులు ఇబ్బందులు పడకుండా ఏపీ ఎస్పీడీసీఎల్ చర్యలు తీసుకుంది. మే నెలలో నూతన విధానాన్ని ప్రవేశపెట్టింది. విద్యుత్ బిల్లులోనే చెల్లించాల్సిన మొత్తానికి క్యూఆర్ కోడ్‌ను జత చేశారు. దీంతో వినియోగదారులు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం యాప్‌ల ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి విద్యుత్ బిల్లులను డిజిటల్ పేమెంట్ ద్వారా చెల్లించవచ్చు. ఈనెలలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్యూఆర్ కోడ్ విద్యుత్ బిల్లులను ప్రయోగత్మకంగా వినియోగదారులకు అందిస్తున్నారు.

ఎర్రకొండపై ఎల్లో గద్దలు

- కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే కొండపై కన్ను
- యథేచ్ఛగా తవ్వకాలు.. సహజ వనరుల దోపిడీ
- రోజూ వందలాది ట్రిప్పుల ఎర్రమట్టి తరలింపు
- అక్రమార్కుల జేబుల్లోకి కోట్లాది రూపాయలు
- కరెంటు స్తంభాలు, నీటి ట్యాంకులున్న స్థలాల్లోనూ తవ్వకాలు
- జగనన్న కాలనీలోని ఇళ్ల మధ్య పెద్ద పెద్ద గుంతలు
- కృష్ణమరెడ్డిపల్లి, నరసనాయనికుంటలోనూ కొండలు కరిగించిన వైనం



ఎర్ర కొండను తవ్వేసిన దృశ్యం

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం అలమూరు జగనన్న కాలనీ పక్కనే ఉన్న ఎర్రకొండపై 'ఎల్లో' గద్దలు వాలాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఓ ముఖ్య ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యులు రంగంలోకి దిగి ఈ కొండ నుంచి యథేచ్ఛగా ఎర్రమట్టిని కొల్లగొడుతోంది. ఎర్రకొండతో పాటు కృష్ణంరెడ్డిపల్లి శివారులోని పెద్దకొండ, నరసనాయనికుంటలో మరోకొండ నుంచి సహజ వనరులను దోచుకుంటూ రూ.కోట్లు జేబుల్లోకి వేసుకుంటున్నారు. ఎర్రమట్టి అక్రమ వ్యవహారం అధికారులందరికీ తెలిసినా ఎవరూ నోరు మెదపడం లేదు.

వర్షం వస్తే అంతే..
అలమూరు ఎర్రకొండ చుట్టు పక్కల జగనన్న కాలనీ ఏర్పాటైంది. వేలాది ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. కరెంటు సదుపాయం కోసం పెద్ద ఎత్తున స్తంభాలు నాటారు. నీటి వసతి కోసం ట్యాంకులూ ఏర్పాటు చేశారు. బరితెగించిన ఎర్రమట్టి దొంగలు చివరకు కరెంటు స్తంభాలు, నీటి ట్యాంకుల చుట్టూ దాదాపు పది అడుగుల లోతు గుంతలు తవ్వి మట్టి తరలించారు. చాలా చోట్ల స్తంభాలు, ట్యాంకులు ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. స్తంభాల కింద మట్టి మొత్తం తీసివేయగా చిన్న వర్షం కురిసినా కూలిపోయే దుస్థితిలో ఉన్నాయి. పట్టపగలే ఇక్కడ తవ్వకాలు చేస్తున్నా అధికారులు ఆటువైపు కన్నెత్తి చూడలేదు. చివరకు ఇళ్లకు కేటాయించిన స్థలాల్లోనూ భారీగా గుంతలు పెట్టి మట్టిని తరలించారు. భవిష్యత్తులో ఈ గుంతలు పూడ్చుకోవాలంటే తాము రూ.లక్షలు ఖర్చు చేసుకోవాల్సి వస్తుందని లబ్ధిదారులు వాపోతున్నారు.



మట్టి తవ్వకాలతో ఒరిగేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాలు

కరిగిపోతున్న పెద్దకొండ..
కృష్ణంరెడ్డి గ్రామ సమీపంలోని 231 సర్వే నంబరులో (చియ్యేడు పొలం) ఉన్న పెద్దకొండ అక్రమార్కుల పుణ్యమా అని కరిగిపోతోంది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో (2014–19 మధ్య కాలంలో) కొందరు టీడీపీ చోటా నాయకులు ఈ కొండ నుంచి ఎర్రమట్టి అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నారు. మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పెద్దకొండపై వారి కన్నుపడింది. ఇటాచీ, జేసీబీలు పెట్టి యథేచ్ఛగా తవ్వకాలు చేస్తూ ఎర్రమట్టిని టిప్పర్లద్వారా తరలిస్తున్నారు. పెద్ద పెద్ద గుంతలు పడడంతో కొండ ఆనవాళ్లు కనిపించకుండా పోయాయి. ఒకప్పుడు మేకలు, గొర్రెలు, ఆవులు, గేదెలు మేతకోసం ఈ కొండపైకి వెళ్లేవి. అక్రమార్కుల పుణ్యమా అని ఇప్పుడు మూగ జీవాలకు మేత లేకుండా చేశారు. అలాగే నరసనాయనికుంట గ్రామ శివారులోని ఆంజనేయస్వామి ధ్వజస్తంభం గుట్టను ఎర్రమట్టి కోసం కొల్లగొట్టారు.



ఇది అనంతపురం రూరల్ మండలం ఆలమూరు సమీపంలోని ఎర్రకొండపై ఉన్న జగనన్న కాలనీలోని చిత్రం. కాసులకు కక్కుర్తి పడిన 'పచ్చ'తోడేళ్ల మట్టితోడేయంతో ఇలా పెద్దగుంత పడింది. రానున్న వర్షాకాలంలో నీరు చేరితే మడుగుగా మారే ప్రమాదం ఉంది. అడిగేవారే లేకపోవడంతో తమ్ముళ్లు బరితెగించి నివాస ప్రాంతాల్లోనూ మట్టిదందా చేస్తున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో టీడీపీ నేతలు ఇలా మట్టి, ఇసుక అక్రమ రవాణా చేస్తూ రూ.కోట్లు కూడబెట్టుకుంటున్నారు. ముఖ్యంగా అనంతపురం రూరల్ మండలంలో ఈ దందా మరింత ఎక్కువగా ఉంది.

సమాధానం చెప్పలేక..
టీడీపీ నేతల అక్రమ తవ్వకాలపై భూగర్భ గనుల శాఖ డీడీని వివరణ కోరేందుకు పలుమార్లు ప్రయత్నించినా...ఆయన అందుబాటులోకి రావడం లేదు. ఏం సమాధానం చెప్పాలో తెలియక అధికారిక నంబర్‌కు వచ్చిన కాల్స్ కూడా ఆయన తీయడం లేదు.

ఖరీఫ్.. ఖరారు

- సాగు అంచనా 3,43,232 హెక్టార్లు
- వేరుశనగ 1.82 లక్షల హెక్టార్లకే పరిమితం
- 55 వేల హెక్టార్లలో కంది, 48 వేల హెక్టార్లలో పత్తి
- నైరుతి కరుణిస్తేనే పంటలు పండే అవకాశం
- కూటమి సాయం లేక అన్నదాతను వెంటాడుతున్న ఖరీఫ్ కష్టాలు



వేరుశనగ పంట

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ సాగు విస్తీర్ణాన్ని అధికారులు లెక్కగట్టారు. గత ఐదేళ్ల పంటల సాగు లెక్కల ఆధారంగా ప్రణాళికశాఖ, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సాగు అంచనాలు సిద్ధం చేశారు. ఈ ఖరీఫ్‌లో అన్ని పంటలు కలిపి 3,43,232 హెక్టార్లు (8,48,126 ఎకరాలు)గా గుర్తించారు. అందులో ప్రధానపంట వేరుశనగ 1,82,004 హెక్టార్లు ఉండగా, ఆ తర్వాత స్థానాల్లో కంది పంట 55,296 హెక్టార్లు, పత్తి 44,001 హెక్టార్లు, ఆముదం 16,293 హెక్టార్లు, మొక్కజొన్న 14,653 హెక్టార్లుగా అంచనా వేశారు. నీటి వసతి కింద 19,446 హెక్టార్లలో వరి నాట్లు వేసే అవకాశం ఉందని అంచనా వేశారు. ఇలా ఐదు ప్రధాన పంటలతో పాటు జొన్న, సజ్జ, రాగి, కొర్ర, పెసర, ఉలవ, అలసంద, మినుము, సోయాబీన్, పొద్దుతిరుగుడు తదితర పంటలు సాగులోకి రావొచ్చని అధికారులు వెల్లడించారు.

గతేడాది తారుమారైన పంటల సాగు..
గత ఖరీఫ్‌లో పంటల సాగు విస్తీర్ణం తారుమారైంది. 3.46 లక్షల హెక్టార్లు అంచనా వేయగా... సక్రమంగా వర్షాలు పడకపోవడంతో చివరకు 3.20 లక్షల హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగులోకి వచ్చాయి. అందులో వేరుశనగ 1.12 లక్షల హెక్టార్లకు బాగా తగ్గిపోయింది. పత్తి కూడా 28 వేల హెక్టార్లకే పరిమితమైంది. సాధారణ సాగు కన్నా 40 శాతం విస్తీర్ణం తగ్గిపోయింది. ఈ పంటల స్థానంలో కంది 1.03 లక్షల హెక్టార్లకు ఎగబాకడం విశేషం. అలాగే మొక్కజొన్న కూడా 20 వేల హెక్టార్లు, ఆముదం 16 వేల హెక్టార్లలో సాగులోకి వచ్చింది. కొర్ర ఏకంగా 9 వేల హెక్టార్లకు చేరుకోవడం గమనార్హం. కంది మినహా మిగతా పప్పుధాన్యాల పంటలు తగ్గిపోయాయి. జూలైలో కురిసే వర్షాలపై ఖరీఫ్ పంటల సాగు ఆధారపడి ఉంటుందని అధికారులు తెలిపారు.

జూన్ మొదటి వారంలో 'నైరుతి' పలకరింపు..
జూన్ నుంచి సెప్టెంబర్ వరకు 'ముంగారు' సీజన్ అత్యంత కీలకం. మెట్ట వ్యవసాయం అధికంగా ఉన్న జిల్లాలో లక్షల హెక్టార్లలో సాగు చేసే పంటలు నైరుతి రుతుపవనాల ప్రభావంతో కురిసే వర్షాలపై ఆధారపడ్డాయి. తొలకర్ల కింద ఇటీవల జిల్లా వ్యాప్తంగా మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు పడటంతో రైతులు సేద్యపు పనులు ప్రారంభించారు. ఈ సారి కీలకమైన నైరుతి రుతుపవనాలు జూన్ 4 నుంచి 10వ తేదీలోపు పలకరించే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు ఖరీఫ్‌గా పరిగణిస్తారు. జిల్లా వార్షిక సాధారణ వర్షపాతం 512.4 మి.మీ కాగా, అందులో ప్రధానంగా ఖరీఫ్ నాలుగు నెలల కాలంలో 319.7 మి.మీ నమోదు కావాల్సి ఉంటుంది. జూన్‌లో 61 మి.మీ, జూలైలో 63.9 మి.మీ, ఆగస్టులో 83.8 మి.మీ, సెప్టెంబర్‌లో 110.9 మి.మీ సాధారణ వర్షపాతంగా నిర్ధారించారు.

అరకొరగా విత్తనం..
నెల రోజుల్లో ఖరీఫ్ మొదలు కానున్న నేపథ్యంలో రైతులకు విత్తన సమస్య ఎదురయ్యే పరిస్థితి నెలకొంది. చంద్రబాబు ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పక్కనపెట్టడంతో వ్యవసాయం భారం కానుంది. కేవలం 54 వేల క్వింటాళ్లతో విత్తన ప్రణాళిక అమలు చేస్తుండటంతో సమస్యగా మారుతోంది. రాయితీ విత్తనాలకు కొర్రీలు వేసి కేటాయింపులు బాగా తగ్గించేయడంతో ఈ సారి విత్తన కష్టాలు తప్పేలా కనిపించడం లేదు. ప్రస్తుతానికి ఎరువుల సమస్య లేదంటున్నా... రైతు సేవా కేంద్రాలకు (ఆర్‌ఎస్‌కే) సరఫరా తగ్గించడంతో రైతులకు పెట్టుబడి ఖర్చులు పెరగనున్నాయి. 'అన్నదాత సుఖీభవ' లేదు, ఇన్‌పుట్‌సబ్సిడీ, ఇన్సూరెన్స్ ఇచ్చే పరిస్థితి కనిపించడం లేనందున ఈ సారి 'అనంత' అన్నదాతకు ఖరీఫ్ కష్టాలు వెంటాడుతున్నాయి.

2025 ఖరీఫ్‌లో పంటల వారీగా సాధారణ సాగు విస్తీర్ణం అంచనా ఇలా:

పంట	సాధారణ సాగు విస్తీర్ణం (హెక్టార్లలో...)
వేరుశనగ	1,82,004
వరి	19,466
కంది	55,296
పత్తి	44,001
ఆముదం	16,293
మొక్కజొన్న	14,653
జొన్న	1,719
సజ్జ	2,054
రాగి	69
కొర్ర	3,311
ఉలవ	1,071
పెసర	455
అలసంద	149
మినుము	312
సోయాబీన్	617
పొద్దుతిరుగుడు	1,642
అనుములు	28

ఇవే కాకుండా సామ, ఊద, అండుకొర్ర, కుసుమ, నువ్వులు, చెరకు, పొగాకు తదితర పంటలన్నీ కలిపి 100 హెక్టార్ల వరకు రావచ్చని అంచనా వేశారు.

తాడిపత్రిలో టెన్షన్.. టెన్షన్

- కేతిరెడ్డి పెద్దారెడ్డిని టార్గెట్ చేసిన జేసీ వర్గం
- జేసీ ఇంటి సమీపంలోని పాఠశాల ప్రాంగణంలో రాళ్లకుప్పలు
- తీసివేయించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్న పోలీసులు



పాఠశాల క్రీడా ప్రాంగణంలో జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరులు వదిలిన రాళ్లకుప్పలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: తాడిపత్రిలో మళ్లీ టెన్షన్ సీన్ నెలకొంది. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లేందుకు హైకోర్టు అనుమతి ఇవ్వడాన్ని జేసీ ప్రభాకర్‌రెడ్డి వర్గం జీర్ణించుకోలేకపోతోంది. ఎలాగైనా పెద్దారెడ్డిని తాడిపత్రిలో అడుగుపెట్టనీయకూడదన్న ఉద్దేశంతో దాడులకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటి ఎదురుగా కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి సమీపంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆట స్థలంలో జేసీ అనుచరులు గురువారం టిప్పర్లతో నాపరాళ్ల వ్యర్థాలను కుప్పలుగా వదిలారు. రాళ్లదాడి చేసేందుకే జేసీ ప్రభాకర్‌రెడ్డి తన అనుచరులతో ప్రణాళిక సిద్ధం చేస్తున్నారని పట్టణంతో తీవ్ర చర్చ జరుగుతోంది. విషయం తెలుసుకున్న ఏఎస్పీ రోహిత్‌కుమార్, సీఐ సాయిప్రసాద్ పలుమార్లు జేసీ ఇంటి పరిసరాలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానాన్ని పరిశీలించారు. మైదానంలో ఉంచిన రాళ్లను తొలగించాలని జేసీ ప్రభాకర్‌రెడ్డికి సూచించినా ఆయన ససేమిరా అన్నట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులే రాళ్లను తొలగించేందుకు సిద్ధమైనట్లు సమాచారం. మరోవైపు పాఠశాల మైదానంలో పోలీసులు సిబ్బందితో బందోబస్తు సైతం ఏర్పాటు చేశారు.

స్వర్ణ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

రాప్తాడు: జిల్లాలో ప్రతి గ్రామాన్ని స్వర్ణ గ్రామంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎం.బండమీదపల్లిలో పర్యటించారు. తొలుత ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పథకం కింద నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. లబ్ధిదారుల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉంటే చెప్పాలని అడిగారు. ప్రభుత్వం నుంచి ఏదైనా సహాయం అవసరమైతే చేస్తామని హామీ ఇచ్చారు. లాలాసాహెబ్‌పల్లి వద్ద ఉన్న చెరువులో ఉపాధిహామీ పథకం కింద చేపడుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. స్వయంగా గడ్డపార చేతబట్టి ఉపాధి పనులు చేశారు. ఉపాధి పనులు నాణ్యతగా చేస్తే.. పనికితగ్గ వేతనం అందుతుందని కూలీలకు సూచించారు. కూలీలకు ఏదైనా ప్రమాదాలు జరిగితే ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకాలు తోడుగా ఉంటాయన్నారు. రూ.2.30 లక్షలతో గోవింద్ అనే పాడి రైతు నిర్మించుకున్న పశువుల షెడ్డును ప్రారంభించారు. ప్రతి ఒక్కరి ఇంటి వద్ద ఇంకుడి గుంత, పొలంలో ఫారంపాండ్, ఇంటి వద్ద పశువులు ఉండాలన్నారు. అనంతపురం జిల్లాలో 1400 పైగా గోశాలలను ఏర్పాటు చేశామని తెలిపారు. లాలాసాహెబ్ పల్లి వరకు తారు రోడ్డు, ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం తదితర సమస్యలపై గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డ్వామా పీడీ సలీం బాషా, డీపీఓ నాగరాజు నాయుడు, సీఈఓ రామచంద్రారెడ్డి, జిల్లా ఉపాధి కల్పన అధికారి కళ్యాణి, డీఎల్‌డీఓ లలితాబాయి, ఎంపీడీఓ విజయలక్ష్మి, డీఎల్‌పీఓ విజయకుమార్, సర్పంచ్ ఉమాదేవి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేడుకగా 'మే' డే



టవర్‌క్లాక్ వద్ద సీఐటీయూ జెండాతో ర్యాలీ చేపట్టిన కార్మికులు



గుంతకల్లు పట్టణంలో నినాదాలు చేస్తున్న దృశ్యం

కార్మిక హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని కార్మిక సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. కార్మిక చట్టాల పరిరక్షణ, హక్కుల సాధనకు మే డే స్ఫూర్తితో సమైక్యంగా ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. గురువారం అనంతపురం జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. వాడవాడాలా కార్మిక జెండాలను ఆవిష్కరించారు. వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికుల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలను చేస్తోందని కార్మిక సంఘాల నాయకులు మండిపడ్డారు. కార్మికులకు కనీస వేతనం, సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం లేదన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. – సాక్షి, నెట్‌వర్క్

'నీట్'కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: 'మెడికల్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తున్న 'నీట్' పరీక్ష ఈనెల 4వ తేదీన జరగనుంది. 2,334 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి.'' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ ఎ.మలోలతో కలిసి 'నీట్' నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... నీట్ పరీక్ష ఐదు కేంద్రాల్లో జరుగుతుందన్నారు. 4వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఉండాలని ఆదేశించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. అదే విధంగా మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. దివ్యాంగ అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా వీల్ చైర్లు, సహాయకులను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రావర్, పరిపాలనాధికారి అలెగ్జాండర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలికల సాధికారత లక్ష్యంగా పనిచేయాలి..
కిశోర బాలికల సాధికారత లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కిశోర బాలికల సమ్మర్ క్యాంపెయిన్ పోస్టర్లను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక సమ్మర్ క్యాంపెయిన్ గ్రామ, వార్డు స్థాయిలో నిర్వహించాలన్నారు. జేసీ శివ్ నారాయణ్‌శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రావర్, డీఆర్‌ఓ ఎ.మలోల తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బ్లడ్ బ్యాంకులో చోరీ

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని బ్లడ్ బ్యాంకులో ఓ హౌస్‌సర్జన్‌కు చెందిన రూ.లక్ష విలువైన సెల్‌ఫోన్ అపహరణకు గురైంది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి వివరాలు... ఈ నెల 28న ఆస్పత్రిలోని గైనిక్ విభాగంలో నైట్ షిఫ్ట్‌లో ఉన్న ఓ హౌస్‌సర్జన్(2కె20 బ్యాచ్) రాత్రి 12 గంటల సమయంలో గర్భిణికి అవసరమైన రక్తం కోసం ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంకు వెళ్లారు. అక్కడ గర్భిణి బ్లడ్ మ్యాచింగ్ సరి చూసుకుంటున్న సమయంలో తన సెల్‌ఫోన్‌ను టేబుల్‌పై ఉంచారు. అనంతరం బ్లడ్ తీసుకుని హడావుడిగా వెళ్లిపోయారు. కాసేపటి తర్వాత తన సెల్‌ఫోన్ కోసం ఆమె మళ్లీ బ్లడ్ బ్యాంక్‌కు చేరుకోగా అక్కడున్న అప్రెంటీస్ టెక్నీషియన్ తనకేమీ తెలియదని బుకాయించాడు. రెండు రోజుల పాటు సెల్‌ఫోన్ అందుబాటులో లేకపోవడంతో విలువైన పాఠ్యాంశాలను ఆమె కోల్పోయింది. ఇదే విషయాన్ని బ్లడ్ బ్యాంక్ వైద్యులు, స్టాఫ్ నర్సుల వద్ద హౌస్‌సర్జన్ చెప్పుకుని బాధపడడంతో గురువారం వారు సదరు అప్రెంటీస్ టెక్నీషియన్‌ని గట్టిగా నిలదీయడంతో దాచిపెట్టిన సెల్‌ఫోన్‌ను తీసి ఇచ్చాడు. ఈ అంశం ప్రస్తుతం ఆస్పత్రిలో హాట్‌టాపిక్‌గా మారింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ఆస్పత్రి అధికారులు ఏ మేరకు చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

వెండి సామగ్రి అపహరణ

గార్లదిన్నె: స్థానిక మధురానగర్‌లోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... మధురానగర్‌లో నివాసముంటున్న శ్రీనివాసులశెట్టి రెండు రోజుల క్రితం తన ఇంటికి తాళం వేసి ముకుందాపురం గ్రామానికి వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువాలోని దాదాపు 10 తులాల వెండి విగ్రహాలు, హారతులు అపహరించారు. గురువారం ఉదయం ఇంటికి చేరుకున్న శ్రీనివాసులశెట్టి చోరీ విషయాన్ని గుర్తించి ఫిర్యాదు చేయడంతో పోలీసులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ఈ పాపం చంద్రబాబుదే!

- సింహాచల ఘటనపై మండిపడుతున్న హిందుత్వ సంఘాలు

అనంతపురం కల్చరల్: 'చంద్రబాబు పాలన వచ్చిందంటే ఆలయాల్లో అలజడి పరిపాటిగా మారింది. తరుచూ భక్తుల ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా కూడా లేదు. ఆలయాలలోనూ అవినీతి, అక్రమాలకు తావిస్తున్నారు' అంటూ హిందుత్వ సంఘాలు మండిపడ్డాయి. సనాతన భారతీయ సంస్కృతికి నిలయమైన ఆలయ వ్యవస్థ ప్రతిష్ట చంద్రబాబు పాలనలో దిగజారిపోతోందంటూ ఈసడించుకున్నాయి. తప్పు జరిగిన ప్రతి సారీ సామాన్య ఉద్యోగులనే బలి చేసి, పెద్దలను కాపాడుతున్న వైనాన్ని తప్పుబడుతున్నాయి. ఇంకా బయట ప్రపంచానికి తెలియని ఎన్నో ఘోరాలు, అమానుషాలు ఆలయాలలో నిత్యకృత్యమవుతంటే హిందుత్వ సంఘాలు, బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు భగ్గుమంటున్నారు.

గత ఘటనల నుంచి నేర్చుకోని పాఠాలు..

గత టీడీపీ పాలన నుంచి నేటి కూటమి ప్రభుత్వం వరకూ ప్రముఖ ఆలయాలు అపవిత్రమవుతూ వస్తున్నాయని బ్రాహ్మణసంఘాల ప్రతినిధులు విమర్శిస్తున్నారు. 20154లో అధికారం చేపట్టిన చంద్రబాబు.. 2015లో గోదావరి పుష్కరాల సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో తన పబ్లిసిటీ పిచ్చితో చేపట్టిన షూటింగ్ వల్ల జరిగిన తొక్కిసలాటలో 29 మంది భక్తులు మృతి చెందారన్నారు. ఇదే ఘటనలో మరో 51 మంతి తీవ్రంగా గాయపడ్డారని గుర్తు చేశారు. 2016లో తిరుమల క్యూలైన్‌లో నారాయణగిరి షెడ్డు వద్ద విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరు భక్తులు మృతి చెందారన్నారు. ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా 2018లో పందిళ్లు కూలడంతో విద్యుత్ షాక్‌కు గురై నలుగురు భక్తులు మృతిచెందారని, మరో 70 మంది గాయపడ్డారని గుర్తు చేశారు. ఈ ఏడాది తిరుమలలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని జనవరి 8న తిరుపతిలోని బైరాగిపట్టెడ ఎంజీఎం స్కూల్, శ్రీనివాసం వద్ద ఏర్పాటు చేసిన టికెట్ కౌంటర్ల వద్ద జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతి చెందాదరన్నారు. మరో 40 మంది గాయపడ్డారని తెలిపారు. తాజాగా సింహాచలం చందనోత్సవం కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని తెలిసినా... రెండు రోజులు క్రితం నిర్మించిన గోడ కుప్పకూలడంతో ఏడుగురు మృత్యువాత పడ్డారన్నారు. ఈ పాపం చంద్రబాబుదేనని స్పష్టం చేశారు.



సింహాచలం ఆలయం వద్ద చేపట్టిన సహాయక చర్యలు (ఫైల్)

మంత్రి రాజీనామా చేయాలి



2015 నుంచి ఇప్పటి వరకూ చోటు చేసుకున్న అత్యంత బాధాకరమైన ఘటనలు పరిశీలిస్తే చంద్రబాబు పాలనలో ఆలయాల నిర్వహణలో అంతులేని నిర్లక్ష్యం కనబడుతోంది. మొత్తం అవినీతి మయం చేస్తున్నారు. దురదృష్ట ఘటనలు పునరావృతమవుతున్నా లెక్కలేనితనంతో ప్రభుత్వ పెద్దలు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా భక్తుల మరణాలు పరిపాటిగా మారుతున్నాయి. ఈ మరణాలను సైతం చాలా చులకనగా చూస్తున్నారు. పుష్కరాలు, తిరుమల వైకుంఠ దర్శనం, ప్రస్తుతం సింహాచలం ఇలా ఎన్నో దుర్ఘటనలు చంద్రబాబు నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. సనాతన ధర్మమని చెప్పే పవన్ కల్యాణ్‌తో పాటూ ధర్మం గురించి మాట్లాడే కూటమి పెద్దలు కూడా దీనికి సమాధానం చెప్పాలి. తాజాగా జరిగిన ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ దేవదాయశాఖ మంత్రి రాజీనామా చేయాలి.

– జ్వాలాపురం శ్రీకాంత్, మాజీ ప్రభుత్వ సలహాదారుడు (ఎండోమెంట్)

దేవదాయ శాఖకు స్వయంప్రతిపత్తి ఇవ్వాలి



పరమ పవిత్ర పుణ్యక్షేత్రాలలో ప్రభుత్వ నిర్వాకం వల్ల భక్తిభావం దెబ్బతింటోంది. తొలుత ప్రభుత్వ పెత్తనం లేకుండా ఎండోమెంటును తప్పించాలి. ట్రస్టులు, మఠాల ఆధ్వర్యంలో సాగే క్షేత్రాలలో ఎన్నడూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకోలేదు. అయితే ప్రభుత్వ ఆధీనంలోని ఆలయాల్లోనే ఈ సమస్య ఎక్కువగా వస్తోంది. సింహాచలం ఘటనకు బాధ్యులైన ఇంజనీరు, ఈఓను బాధ్యతల నుండి తప్పించాలి. కాంట్రాక్టర్లను కఠినంగా శిక్షించాలి.

– సీహెచ్ విశ్వేశ్వరరెడ్డి, అధ్యక్షుడు, హిందూ చైతన్యవేదిక

మంత్రుల పర్యవేక్షణ ఇదేనా?



టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన ప్రతిసారీ ఆలయాల్లో అలజడి రావడం ఆనవాయితీగా మారింది. జరిగిన ప్రతి దుర్ఘటనకు వైఎస్ జగన్‌ను బాధ్యుడిని చేసి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుండడం మంచిది కాదు. ఆలయాలలో పటిష్టమైన యంత్రాంగాన్ని నియమించాలి. మంత్రులు ఐదురోజులుగా పర్యవేక్షించామని చెపుతున్నారు. ఇదేనా పనికిమాలిన పర్యవేక్షణ. ప్రభుత్వ పెద్దలు తప్పు చేస్తే చిన్నపాటి ఉద్యోగులను బలి చేయడం భావ్యం కాదు.

– గూడూరు మనోహర్, సామాజిక సేవా కార్యకర్త

భక్తిభావం లోపిస్తోంది



కొన్ని నెలలుగా పుణ్యక్షేత్రాల సందర్శనలో భక్తి భావం లోపిస్తోంది. ఎప్పుడు ఎలాంటి దుర్ఘటనను చవి చూడాల్సి వస్తుందోననే ఆందోళనే ఎక్కువగా ఉంటోంది. తప్పులన్నీ ప్రభుత్వం చేసి దేవుడి మహిమగా మాట్లాడుకునేలా చేస్తుండడం విచారకరం. బాధ్యులను కఠినంగా శిక్షించడానికి కనీస చర్యలు చేపట్టక పోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. మంత్రుల మాటల్లో లెక్కలేనితనం కనపడుతోంది. ఇకనైనా ఆలయాల భద్రతపై చంద్రబాబు ఆలోచించాలి.

– అనంత పద్మనాభశర్మ, బ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రతినిధి

అధినేతతో భేటీ



వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో ఆ పార్టీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజానాథ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ రఘునాథరెడ్డి, బండ్ల ప్రతాపరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర నాయకుడు తరిమెల వంశీగోకుల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పూల ప్రసాద్, పుట్లూరు ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి, విష్ణు నారాయణ, జెడ్పీటీసీ భోగాతి ప్రతాప్‌రెడ్డి, కల్లూరు ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

– శింగనమల:

తాడిపత్రికి చేరుకున్న సమీరా



తాడిపత్రి రహదారులపై సైక్లిస్ట్ సమీరా ఖాన్

తాడిపత్రి టౌన్: జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ పర్వతారోహకురాలు, సైక్లిస్ట్ సమీరాఖాన్ మహిళా సాధికారత కోసం అనంతపురం నుంచి నేపాల్ వరకూ చేపట్టిన సైకిల్ యాత్ర గురువారం తాడిపత్రికి చేరుకుంది. ఈ సందర్భంగా జేసీ నివాసానికి వెళ్లి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిని కలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకూ 37 దేశాల్లో సైకిల్ యాత్రలు, 11 పర్యాయాలు ఎత్తైన పర్వతాలను అధిరోహించినట్లు గుర్తు చేశారు. ప్రతి సాహసం వెనుక ఓ సదుద్దేశం ఉందన్నారు. ప్రస్తుతం అనంతపురం నుంచి నేపాల్‌కు 3,500 కి.మీ. సైకిల్ యాత్రలో మార్గమధ్యంలోని ప్రతి గ్రామంలోనూ మహిళా సాధకారతపై ప్రజలను చైతన్య పరుస్తూ ముందుకు సాగుతానన్నారు. తన ఈ యాత్ర దాదాపు 70 రోజుల్లో పూర్తవుతుందన్నారు.

పేకాటరాయుళ్ల పట్టివేత



పోలీసుల అదుపులో ఉన్న జూదరులు

నార్పల: క్షేత్ర దర్శనానికి వచ్చిన పలువురు పేకాట ఆడుతూ పోలీసులకు పట్టుబడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... వైఎస్సార్ జిల్లా కడప, ప్రొద్దుటూరుతో పాటు తాడిపత్రికి చెందిన పలువురు గురువారం నార్పల మండలం గూగూడులో వెలసిన కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలను దర్శించుకునేందుకు వచ్చారు. పూజాదికాలు ముగించుకున్న అనంతరం అక్కడే విందులో పాల్గొని పేకాట మొదలు పెట్టారు. విషయాన్ని పసిగట్టిన ఎస్పీ జగదీష్ ఆధీనంలోని ప్రత్యేక బృందం అక్కడకు చేరుకుని పేకాట ఆడుతున్న దాదాపు 29 మందిని అదుపులోకి తీసుకుని, నార్పల పీఎస్‌కు తరలించారు. జూదరుల నుంచి రూ.8,98,410 నగదు, 28 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సాగర్ తెలిపారు.

చీనీ తోటల్లో డ్రోన్ సర్వేతో అధ్యయనం



డ్రోన్ సర్వేపై అవగాహన కల్పిస్తున్న ఉద్యాన అధికారులు

గార్లదిన్నె: చీనీ తోటల్లో పురుగులు, తెగుళ్లు, యాజమాన్య పద్ధతలపై సాంకేతికంగా డ్రోన్ సర్వేతో అధ్యయనం చేసి రైతులకు సలహాలు, సూచనలు అందించవచ్చునని జిల్లా ఉద్యాన అధికారి ఫిరోజ్‌ఖాన్ అన్నారు. గురువారం గార్లదిన్నె మండబలం ముకుందాపురంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో డ్రోన్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ని రైతులకు చేరువ చేయాలని ఉద్దేశ్యంతో రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా ముకుందాపురం గ్రామాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా 17 బృందాలు ముకుందాపురంలోని చీనీ తోటలను సందర్శించి జీపీఎస్ ట్రాకింగ్ చేసి ప్రభుత్వానికి పంపిస్తాయన్నారు. అలాగే కంపెనీ సాంకేతిక సహకారంతో డ్రోన్‌లో ఏర్పాటు చేసిన మల్టీ స్పెషల్ ఐదు కెమెరాల ద్వారా చీడపీడలపై చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై సలహాలు, సూచనలు అందిస్తారన్నారు. మూడు రోజులుగా డ్రోన్‌ల ద్వారా 500 హెక్టార్ల విస్తీర్ణంలో అధ్యయనం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి రత్నకుమార్, విస్తరణాధికారి రామాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

మామిడి చెట్ల నరికివేత కేసులో ఇద్దరి అరెస్ట్

పెద్దవడుగూరు: మండలంలోని చిత్రచేడు గ్రామ సమీపంలోని పెన్నా పరివాహక ప్రాంతంలో గత నెల 17న దళితులకు చెందిన 105 మామిడి చెట్లు నరికిన ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు పక్కా ఆధారాలతో కమ్మన్నగారి రమేష్, వీరన్నపల్లి గ్రామానికి చెందిన చింతాకు శంకర్‌ను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేశారు. రమేష్‌కు ఆ గ్రామంలోని ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉందని, ఈ విషయంగా రమేష్‌ను మామిడి రైతులు మందలించడంతో కక్ష పెంచుకున్న అతను... సదరు మహిళ ప్రోద్బలంతో తన స్నేహితుడు శంకర్ సహకారంతో మామిడి చెట్లను నరికి వేసినట్లుగా అంగీకరించాడన్నారు. గతంలోనూ వీరు బాధితుల గడ్డివామికి నిప్పంటించారని, స్టార్టర్ పెట్టెను అపహరించారని గుర్తు చేశారు.

డాడీ.. ఫంక్షన్‌కు వెళ్లొస్తా!

- ఇదే భావి వైద్యుడి చివరి ఫోన్‌కాల్
- నెల్లూరులో బుధవారం చోటు చేసుకున్న ప్రమాదంలో దుర్మరణం
- జిల్లాకు చేరిన అభిషేక్‌రాజ్ మృతదేహం... అంత్యక్రియలు పూర్తి
- కుమారుడి మృతిని తట్టుకోలేకపోతున్న తల్లిదండ్రులు



మృతుడు అభిషేక్‌రాజ్ ఇంటివద్ద కుటుంబ సభ్యులు, బంధువులు

అనంతపురం ఎడ్యుకేషన్: 'డాడీ... ఫ్రెండ్ సిస్టర్ ఫిక్షేషన్ ఫంక్షన్ ఉంది. నేనూ వెళ్లొస్తా'నంటూ కుమారుడు చేసిన కాల్ చివరిదవుతుందని ఆ తల్లిదండ్రులు ఊహించలేదు. ఉదయం ఫోన్ చేసిన కుమారుడు.. మధ్యాహ్నం ప్రమాదంలో మృతి చెందినట్లుగా సమాచారం అందుకున్న వారి రోదనకు అంతులేకుండా పోయింది. తమ ఇంటి ఆశల సౌధం కుప్పకూలిందనే చేదు నిజాన్ని తట్టుకోలేక పోతున్నారు. ఇది అనంతపురం రూరల్ మండలం పంగల్‌రోడ్డు సమీపంలోని శిల్ప లేపాక్షి నగర్‌కు చెందిన ఉపాధ్యాయులు రవినాయక్, ప్రమీలా బాయి దంపతుల కన్నీటి వ్యథ.

వైద్యుడిగా వస్తాడనుకుంటే..

శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో బయలాజికల్ సైన్స్ టీచరుగా రవినాయక్, అదే జిల్లా ముదిగుబ్బ జెడ్పీహెచ్‌ఎస్‌లో తెలుగు టీచరుగా ప్రమీలాబాయి పని చేస్తున్నారు. వీరికి కుమార్తె నిహారిక, కుమారుడు అభిషేక్‌రాజ్ ఉన్నారు. నిహారిక ఇప్పటికే ఎంబీబీఎస్ పూర్తి చేసి సివిల్స్‌కు సన్నద్ధం అవుతోంది. అభిషేక్‌రాజు నెల్లూరులోని నారాయణ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వైద్యుడి మారి వస్తాడని, పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తారని ఎంతో ఆశతో తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు. బుధవారం తల్లిదండ్రులకు ఫోన్ చేసిన అభిషేక్ రాజు... తన స్నేహితుడి సోదరి వివాహ నిశ్చితార్థ కార్యక్రమానికి వెళుతున్నట్లు తెలిపాడు. కార్యక్రమం ముగించుకుని మధ్యాహ్నం స్నేహితులంతా కారులో తిరుగు ప్రయాణమయ్యారు. కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం వద్దకు చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న దుకాణంలో దూసుకెళ్లి బోల్తాపడింది. ఘటనలో కారులో ప్రయాణిస్తున్న అభిషేక్‌రాజ్‌తో పాటు మరో నలుగురు మెడికోలు మృతి చెందారు. ఈ విషయం తెలియగానే తల్లిదండ్రులు ఒక్కసారిగా కుదేలయ్యారు.

అంత్యక్రియలు పూర్తి..

గురువారం ఉదయం శిల్పాలేపాక్షి నగర్‌లోని ఇంటికి అంబులెన్స్‌లో అభిషేక్ మృతదేహం తీసుకొచ్చారు. మృతదేహాన్ని చూడగానే కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. చుట్టుపక్కల కుటుంబాల వారు తరలివచ్చారు. అంత్యక్రియలు పూర్తి చేశారు. కాగా... వైద్య విద్యార్థులందరూ స్నేహితుడి ఇంట్లో శుభకార్యంలో పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం 1.55 గంటలకు మెడికల్ కళాశాలలో తరగతికి వెళ్లాల్సి ఉంది. 25 నిముషాలు మాత్రమే సమయం ఉండడంతో అతివేగంగా వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకున్నారన్న విషయం తెలియగానే అందరి హృదయాలు బరువెక్కిపోయాయి.

కార్మికుల పక్షపాతి వైఎస్సార్‌సీపీ

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి



వైఎస్సార్‌టీయూసీ జెండాను ఎగురవేసి నినాదాలు చేస్తున్న అనంత వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి, తదితరులు

అనంతపురం కార్పొరేషన్: ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కార్మికుల సమస్యల కోసం రాజీలేని పోరాటాలు చేసిన వైఎస్సార్‌సీపీ కార్మికుల పక్షపాతిగా ఖ్యాతి గాంచిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి అన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కూడా కార్మికుల సంక్షేమానికి అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్ టీయూసీ ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ట్రేడ్ యూనియన్ జెండాను ఆ విభాగం జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా అనంత వెంకట్రామిరెడ్డి మాట్లాడారు. అంగన్‌వాడీలు, మునిసిపల్ కార్మిలకు కష్టాన్ని గత గత ప్రభుత్వాలు గుర్తించలేదన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ టీచర్లకు రూ.10వేలు, మునిసిపల్ కార్మికులకు రూ.18వేల వరకు వేతనాలు పెంచారన్నారు. అంతేకాక వేతనాలను నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేస్తూ వచ్చారన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే ఆర్టీసీను ప్రభుత్వంలోకి విలీనం చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ... కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులకు ప్రమాదకర రోజులు వచ్చాయన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయన్నారు. ఓబిరెడ్డి మాట్లాడుతూ.. మే డే విశిష్టతను వివరించారు. ఆటో డ్రైవర్లు, నాయీ బ్రాహ్మణులకు, మత్స్యకారులకు రూ.10వేలు అందించి శ్రమజీవుల పక్షపాతిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిలిచారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి, మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి, రాష్ట్ర నాయకులు పెన్నోబులేసు, కృష్ణవేణి, రహంతుల్లా, అనుబంధ సంఘాల అధ్యక్షులు శ్రీదేవి, వైపీ బాబు, మల్లెమీద నరసింహులు, సీపీ వీరన్న, ఉమాపతి, అమర్‌నాథరెడ్డి, చంద్రశేఖర్ యాదవ్, శ్రీనివాసనాయక్, నాయకులు పామిడి వీరాంజనేయులు, ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, వెన్నం శివరామిరెడ్డి, కొర్రపాడు హుస్సేన్‌పీరా, అనిల్‌కుమార్‌గౌడ్, ఎం.నరేష్, కోనా రాజారెడ్డి, కాకర్ల శ్రీనివాసరెడ్డి, మీసాల రంగన్న, పుల్లయ్య, ఇషాక్, మార్కెట్ ఖాజా, వెన్నపూస రామచంద్రారెడ్డి, శోభాబాయి, శోభారాణి, భారతి, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, సంపంగి రామాంజినేయులు, ఇషాక్, శ్రీనివాసులు, సాకే చంద్రలేఖ, తదితరులు పాల్గొన్నారు.

కేసులతో భయపెట్టాలని చూస్తున్న ప్రభుత్వం : అనంత



గోరంట్ల మాధవ్‌ను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజా సమస్యల పరిష్కారం కంటే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు, అరెస్టులపైనే ఎక్కువ దృష్టి సారిస్తోందని, కేసులతో భయపెట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తోందనివైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి మండిపడ్డారు. బెయిల్‌పై వచ్చిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్‌ను గురువారం ఆయన నివాసంలో అనంత వెంకట్రామిరెడ్డి కలసి మాట్లాడారు. ప్రశ్నించే వారిని భయపెట్టి అణచివేయాలని చూడడం ఓ విధంగా కూటమి ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు. ప్రజాస్వామ్యంలో ఇది సరైన పద్ధతి కాదన్నారు. ప్రభుత్వ పెద్దల తీరు మారకపోతే పర్యావసనాలు చాలా తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ప్రతిపక్షంలో ఉండడం వైఎస్సార్‌సీపీకి కొత్తేం కాదన్నారు. కచ్చితంగా ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. కేసులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మాధవ్‌ను కలిసిన వారిలో డీసీసీబీ మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు ధనుంజయయాదవ్ ఉన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులతో కమాండర్ ముఖాముఖి



ఎన్‌సీసీ విద్యార్థులతో కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఆర్ట్స్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులతో కర్నూలు ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠి గురువారం ముఖాముఖి నిర్వహించారు. క్రమశిక్షణ, నాయకత్వం, జాతీయ సేవ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కేడెట్ల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం వివిధ ఎన్‌సీసీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం, సమాజ సేవ, అడ్వెంచర్ శిక్షణ, జాతీయ సమైక్యత శిబిరాల్లో పాల్గొన్న కేడెట్లను అభినందించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఈఎస్ అహమ్మద్, ఎన్‌సీసీ అధికారులు డాక్టర్ ఎం. రామాంజనేయులు, జి. చిన్నవెంకటమ్మ పాల్గొన్నారు.

ముగ్గురికి రిమాండ్

తాడిపత్రి టౌన్: స్థానిక గాంధీనగర్‌లో గత ఏడాది డిసెంబర్ 15న కుళ్లాయమ్మ, ఆమె కొడుకులపై అదే ప్రాంతానికి చెందిన పవన్, పుల్లయ్య, మహేష్ దాడి చేసిన విషయం తెలిసిందే. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం ఉదయం నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సాయి ప్రసాద్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో నూతనోత్తేజం

- వైఎస్సార్‌సీపీ బలోపేతానికి మాజీ సీఎం వైఎస్ జగన్ చర్యలు
- పార్టీ అనుబంధ నగర విభాగాల నియామకం
- పార్టీ కోసం శ్రమించిన వారికి చోటు కల్పిస్తూ ఉత్తర్వుల జారీ





వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంతను సన్మానిస్తున్న ట్రేడ్ యూనియన్ ఎం.నరేష్ కుమార్, శోభా బాయి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు అధిష్టానం చర్యలకు ఉపక్రమించింది. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లోనూ పార్టీ బలంగా ఉండేందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో అనంతపురం నగరంలో వివిధ అనుబంధ సంఘాల నగర కమిటీల్లో పార్టీ నాయకులకు చోటు కల్పిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది.

▸▸ **బీసీ విభాగం :** ఉపాధ్యక్షులుగా అవేటి రామమూర్తి, పోతుల రాజు, ప్రధాన కార్యదర్శులు వడ్డే కాటమయ్య, బైళ్ల హరికృష్ణ, మంగల రామకృష్ణ, డీ నాగరాజు, వై చంద్రాయుడు, తలారి నరసింహులు, కురుబ చంద్రశేఖర్, కార్యదర్శులుగా సంగాల సురేష్, పీఎం బాలాజీ, అంకె తేజ, బి.హరికృష్ణ, బొగ్గు నీలవేణి, ఎం బసవరాజు, ఎంసీ పోతులయ్య, సీమ సురేష్, రామకోళ్ల మధుసూదన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మామిళ్ల రామమోహన్, చాకలి ఆనంద్.

▸▸ **మహిళా విభాగం:** ఉపాధ్యక్షురాలిగా సి.లక్ష్మీదేవి, జి.లక్ష్మీనరసమ్మ, ప్రధాన కార్యదర్శులుగా కె.పద్మావతి, జి.ప్రసన్న, జి.చంద్రకళావతి, ఎం.కమర్ తాజ్, వి.మహేశ్వరి, తలారి లలిత, కార్యదర్శులుగా పి.అంజనమ్మ, ఉష మగర్తల, కుమ్మెత లక్ష్మి, లీలావతి, జోడు భానుమతి, షేక్ రమీజ, నారాయణమ్మ, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా బోయ జయమ్మ, పి.నాగజ్యోతి, డి.కుళ్లాయమ్మ, వడ్డే భార్గవి, టి.నళిని, సీహెచ్ సీతా, సి.శైలజ, ఎస్.హసీనా, కాయల అనిత, ఎం.స్వర్ణరేఖ, ఎస్.నాగవేణి, జె.ప్రతిభ.

▸▸ **మైనార్టీ విభాగం:** ఉపాధ్యక్షులుగా సయ్యద్ మహమ్మద్ రఫిఉద్దీన్, ఆలూరు మహమ్మద్ ఆసిఫ్, ప్రధాన కార్యదర్శులుగా షేక్ అబ్బాస్, షేక్ జావిద్, పఠాన్ అహమ్మద్ ఖాన్, జిలకర మహమ్మద్ రఫి, సి.మహమ్మద్ రియాజ్, కార్యదర్శులుగా ఎస్.ఇసాక్, షేక్ మహబూబ్ బాషా, ఎస్ మదార్ వలి, షేక్ షెక్షావలి, షేక్ ఇర్షాద్, తాడిమర్రి మసూద్ వలి.

▸▸ **మునిసిపల్ విభాగం:** ఉపాధ్యక్షులుగా బాగేపల్లి కిషోర్ బాబు, మైలవరం చెన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా జీఎం విజయభాస్కర్, ఎం.సూర్యనారాయణరెడ్డి, బి.రోజా రమణి, కె.విజయసింహ రెడ్డి, నాగభూషణ, కార్యదర్శులుగా బి.విజయభాస్కర్ రెడ్డి, డి.సాలమ్మ, డి.సత్యనారాయణ రెడ్డి, రాజు కుళ్లాయప్ప, షేక్ హసీన, పెద్ద గంపయ్య, ఏ.గౌతమి.

▸▸ **పంచాయతీరాజ్ విభాగం:** ఉపాధ్యక్షులుగా వడ్డే సురేంద్ర, చిన్నప్పరెడ్డిగారి సుధాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా బెస్త నాగరాజు, దూదేకుల జాఫర్ వలి, షేక్ బషీరుద్దీన్, షేక్ అబ్దుల్, జీ శ్రీనివాసులు, కార్యదర్శులుగా ఉప్పర లక్ష్మి, మాల పరంధామ, తలారి నరసింహులు.

▸▸ **ప్రచార విభాగం:** ఉపాధ్యక్షులుగా పోతన్నగారి శివయ్య, నల్లబోలు సందీప్ రాయల్, ప్రధాన కార్యదర్శులుగా కె.నారాయణ రెడ్డి, షేక్ షబ్బీర్, ఎం.మల్లికార్జున రెడ్డి, సంగాల పవన్‌కుమార్, మాలపాటి వెంకటేష్, కురపాటి రంగారెడ్డి, ఈడిగ భాస్కర్ గౌడ్, కార్యదర్శులుగా మేదర కృష్ణయ్య, ఎం.శ్రీనివాసులు, నక్కల రాము, ఎం.నరేంద్ర రెడ్డి, ఎస్ నారాయణ రెడ్డి, కొత్తకోట వెంకటరమణ, సుండూరు వెంకట ప్రసాద్, కే అరవింద రెడ్డి.

▸▸ **ఎస్సీ సెల్:** ఉపాధ్యక్షులుగా సాకే శోభన్ కృష్ణ, మాదిగ ఓబుళపతి, ప్రధాన కార్యదర్శులుగా అరవింద్ రమేష్‌బాబు, మాదిగ ఫక్కీర్, దొడ్డి ఈశ్వరయ్య, మీసుగ హరి, సాకే అశోక్ కుమార్, జూటూరు మారుతి, కార్యదర్శులుగా ఎస్ రఘునందన్, టి.అనిల్ కుమార్, గురుడపల్లి చరణ్, వై.నరేష్, ఎం.కుళ్లాయప్ప, గోనుల యాకోబ్, మద్దెల కార్తీక్ కుమార్, వి.రామాంజనేయులు.

▸▸ **సోషల్ మీడియా:** ఉపాధ్యక్షులుగా పన్నాలే జిలాన్ బాషా, బి.నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా షేక్ షామీర్, ఎంపీ సురేష్, షేక్ ఇద్రిస్ ఇబ్రహీం, వీ శ్రీనివాసులు, పీ శివనంద రెడ్డి, కార్యదర్శులుగా షేక్ మహ్మద్ వసీం, షేక్ మహ్మద్ ఇమ్రాన్.

▸▸ **ఎస్టీ సెల్:** ఉపాధ్యక్షులుగా సాకే రాజు, బి.చక్రవర్తి నాయక్, ప్రధాన కార్యదర్శులుగా ఎస్ నాగార్జున, వి.నాగేంద్ర నాయక్, ఎస్.గౌతమ్‌నాయక్, పి.రాజు నాయక్, వై.ఈరన్న, కార్యదర్శులుగా బి.యోగేష్ నాయక్, ఎస్.ప్రసాద్ నాయక్, రామావత్ సుధాకర్ నాయక్, సాకే మణికంఠ, ఆర్ చెన్నకేశవులు, సాకే పెద్దన్న, జి.సర్దార్, సాకే నాగరాజు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ముడే దినేష్ కుమార్ నాయక్, సాకే వంశీ, వై సుంకన్న, జి.సురేష్, కె.శేషాద్రి, వై.రమణ.

▸▸ **విద్యార్థి విభాగం:** ఉపాధ్యక్షులుగా సీ అంజన్ రెడ్డి, జెరిపిటి శివదత్తాత్రేయ, ప్రధాన కార్యదర్శులుగా పీ శౌకత్ అలి, కే సాయికుమార్ రెడ్డి, ఎస్ నవాజ్, కే సుందరాజు, ఈ గౌతమ్ గౌడ్, కార్యదర్శులుగా పులి కార్తికేయ, దూదేకుల తబ్రేజ్, కొరివిపేట రజిత్ బాబు, సంగం రాహుల్ రెడ్డి, షేక్ ముబారక్, షేక్ మహమ్మద్ గౌస్, బీ కార్తీక్, షేక్ మహమ్మద్ రఫి, మెదినాల ఫయాజ్.

▸▸ **వాణిజ్య విభాగం:** ఉపాధ్యక్షులుగా పామిడి రామకృష్ణ ప్రసాద్, పుట్లూరు సోమశేఖర్ రెడ్డి, మంచికంటి సంతోష్ కుమార్, వి.నందబాల కిషోర్, గోనుగొండ్ల వీరేష్, గడ్డం వెంకటరామిరెడ్డి, ఎస్.సోహైల్, కార్యదర్శులుగా నూర్ మహమ్మద్, మహమ్మద్ రఫి, జి.కిరణ్‌కుమార్, టీజీ శ్రీనివాసులు.

▸▸ **వలంటీర్స్ విభాగం:** ఉపాధ్యక్షులుగా దాసరి శ్రీనివాసులు, మంగల శివకుమార్, ప్రధాన కార్యదర్శులుగా వడ్డే రంగయ్య, షేక్ నజీర్, అంగేరి సందీప్ రెడ్డి, యల్లనూరు అబూబాకర్, మారపరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బిల్లె ఆదినారాయణ, కార్యదర్శులుగా దేవర నాగేంద్ర, వై వెంకటేశ్వర రెడ్డి, షేక్ చాంద్‌బాషా, జూటూరు గోవింద్ రెడ్డి, జీ నారాయణ రెడ్డి, కే దేవానంద రెడ్డి, ఈడిగ శివకుమార్ గౌడ్, ఎం జగపతి బాబు.

▸▸ **యువజన విభాగం:** ఉపాధ్యక్షులుగా పాయల ఉదయ్‌కుమార్, బోయ వినీత్‌బాబు, ప్రధాన కార్యదర్శులుగా ఎం ప్రదీప్, సుగాలి నగేష్ నాయక్, బిల్లే నాగర్జున, రాప్తాడు నందికుమార్, ఎస్ ఖాజా నిజాముద్దీన్, బొందలవాడ ధనుంజయ బాబు, కార్యదర్శులుగా కే ఖాజా మైనుద్దీన్, బెస్త వేణుగోపాల్, పీ బ్రహ్మానంద రెడ్డి, గోగుల జయసింహ, మజ్జిగ వినయ్ రెడ్డి, షేక్ మసూద్‌వలి, పీ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎం అనిల్‌కుమార్, రఘునాథ్ గౌడ్ బోనసి, ఇంద్రసేనా రెడ్డి, ఈ రమేష్‌గౌడ్, జే నరేంద్ర, కే రెడ్డి షైద్, జీ రాంభూపాల్ రెడ్డి.

▸▸ **ట్రేడ్ యూనియన్:** ఉపాధ్యక్షులుగా బెస్త తిరుపాల్, డీ విశ్వనాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా కాకర్ల శ్రీనివాస్ రెడ్డి, పాపిరెడ్డి పుల్లారెడ్డి, ఎస్.మహమ్మద్ హుస్సేన్, పాలగిరి రాజశేఖర్ రెడ్డి, కె.బయన్న, సీ రషీద్‌ఖాన్, కార్యదర్శులుగా పాముదుర్తి చిన్న వెంకటరెడ్డి, జి.ఇస్మాయిల్ దౌలా, పీహెచ్ కుళ్లాయప్ప, తాడిమర్రి దాదాబాషా, వేల్పుమడుగు రామాంజనేయులు, బిక్క సూరి, మంగల సుబ్రమణ్యం.

కష్టపడే వారికి సముచిత స్థానం

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కష్టపడే వారికి సముచిత స్థానం ఉంటుంది. క్షేత్రస్థాయిలో పార్టీని బలపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల జిల్లా, నగర కమిటీల్లో అధిక సంఖ్యలో నాయకులకు చోటు కల్పిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ హోదాల్లో ఉన్న వారంతా గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిని ఆయన నివాసంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

క్లుప్తంగా

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ బాలస్వామి

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను కమిషనర్ బాలస్వామి గురువారం పరిశీలించారు. కమలానగర్‌లో డ్రైనేజీ బ్లాక్ అయిన విషయాన్ని తెలుసుకున్న కమిషనర్ ఘటన స్థలానికి వెళ్లారు. తక్షణం పారిశుధ్యం మెరుగుకు తగు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. డ్రైనేజీలు బ్లాక్ అవకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పారిశుధ్య కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు.

రాష్ట్రీయ మిలటరీ స్కూల్‌కు ఎంపిక



యువరాజ్‌ను అభినందిస్తున్న డైరెక్టర్లు

అనంతపురం ఎడ్యుకేషన్: గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన రాష్ట్రీయ మిలటరీ స్కూల్ ప్రవేశ పరీక్షలో నగరంలోని రఘు సైనిక్ స్కూల్ విద్యార్థి లింగాల యువరాజ్ సత్తా చాటాడు. బెంగళూరు సైనిక్ స్కూల్‌కు ఎంపికయ్యాడు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డైరెక్టర్లు రాఘవేంద్ర, గురుప్రసాద్, లోకేష్ తదితరులు విద్యార్థిని అభినందించారు. జాతీయస్థాయిలో ఉన్న ఐదు సీట్లలో ఒక సీటు తమ విద్యార్థి సాధించడం గర్వకారణమన్నారు.

రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఏజీఎం సుబ్బారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఏప్రిల్ 29, 30 తేదీల్లో విజయవాడలోని గోశాలలో జరిగిన డాక్టర్ బీఎస్ రావు స్టేట్ లెవెల్ స్పోర్ట్స్ మీట్‌లో శ్రీ చైతన్య అనంతపురం జోన్ విద్యార్థులు సత్తా చాటి ట్రోఫీ కైవసం చేసుకున్నారని ఏజీఎం సుబ్బారెడి తెలిపారు. గురువారం నగరంలోని కమ్మ భవన్ సమీపంలోని శ్రీచైతన్య స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఎస్ రావు జోనల్ స్పోర్ట్స్ మీటింగ్ అనంతపురంలో నిర్వహించి అందులో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను విజయవాడకు పంపామన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. షటిల్ బ్యాడ్మింటన్ జూనియర్ బాయ్స్ విభాగంలో గుంతకల్లు బ్రాంచ్ 6వ తరగతి విద్యార్థి దేవేష్ యాదవ్ విన్నర్, జూనియర్ త్రోబాల్ బాలికల విభాగంలో అనంతపురం బాలికలు విన్నర్స్‌గా నిలిచారన్నారు.

సేవ్ ఆర్డీటీ



నినాదాలు చేస్తున్న నాయకులు

అనంతపురం: ఆర్డీటీని రక్షించుకుందామని అనంత రెడ్‌డ్రాప్స్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఆర్డీటీ సేవలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ గురువారం అనంతపురం ఆర్డీటీ ప్రధాన కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం వైఖరిపై నిరసన తెలిపారు. పలువురు మాట్లాడుతూ.. ఐదు దశాబ్దాలుగా అనంతపురం జిల్లాకు వరప్రదాయినిగా ఉన్న ఆర్డీటీ సేవలు ఆగిపోతే నిరుపేద, అణగారిన వర్గాల విద్యార్థులు, ప్రజలు తీవ్రంగా నష్టపోతారన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోతే ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఒత్తిడి తీసుకరావాలని కోరారు. అనంత రెడ్‌డ్రాప్స్ చారిటబుల్ ట్రస్టు చైర్మెన్ సర్దార్‌వలి, లీగల్ అడ్వైజర్ త్యాగరాజు, సహాయ కార్యదర్శులు దాదు, పవన్‌సాయి, నవీన్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ బాబా, ఆలీ, సభ్యులు వెంకటసాయి, రామలింగ, మధు పాల్గొన్నారు.

ఆర్డీటీ సేవలు కొనసాగించాలి

అనంతపురం కల్చరల్: ఆర్డీటీకి ఇబ్బందులు తొలగాలని గురువారం సాయిట్రస్టు వారు తపోవనంలోని శివశక్తిబాబా మందిరంలో మహన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకాలు చేయించారు. ట్రస్టు అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. వెనుకబడిన ప్రాంతాలకు కల్పతరువుగా ఉన్న సంస్థకు విదేశీయ విరాళాల నియంత్రణ చట్టం కింద మంజూరు చేసిన అనుమతిని పునరుద్ధరించాలన్నారు. సేవలు యథావిధిగా కొనసాగేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆకట్టుకున్న 'ఎర్రపద్యాలతో ఓ సాయంత్రం'



మాట్లాడుతున్న రాంభూపాల్

అనంతపురం కల్చరల్: స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో మే డే సందర్భంగా 'ఎర్రపద్యాలతో ఓ సాయంత్రం' పేరుతో గురువారం కవి సమ్మేళనం జరిగింది. జిరసం అధ్యక్షుడు కొత్తపల్లి సురేష్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంగోపాల్, సత్యసాయి జిల్లా సీపీఐ కార్యదర్శి వేమయ్య యాదవ్, మానవతా సంస్థ కన్వీనర్ తరిమెల అమరనాథరెడ్డి, ఆచార్య సుధాకరబాబు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తప్పు చేసేది ప్రభుత్వమే అయినా ప్రశ్నించే గొంతుక కవిది అయి ఉండాలన్నారు. ప్రస్తుతం అన్ని రంగాల్లో కాషాయీకరణతో అభివృద్ధి వెనక్కువెళ్లిపోతోందని కవిత్వం మాత్రం తనదైన ముద్రతో నిరంతరం ప్రశ్నిస్తూనే ఉండడం అభినందనీయమన్నారు. పేదల కడుపు నింపని ప్రభుత్వాలను కవిత్వం ద్వారానే ప్రశ్నించాలన్నారు. కవులు షరీఫ్, చేగువేరా హరి, మనోహర్, విశ్వనాథరెడ్డి, సూర్యనారాయణ, రామచంద్రానాయక్, అశ్వర్థరెడ్డి తదితరులు చదివిన కవితలను డాక్టర్ శ్రీనివాస్ సమీక్ష చేశారు. కవితలు చదివిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిరసం గౌరవాధ్యక్షులు జెన్నే ఆనంద్ కుమార్, మధురశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో చోటు

ఆత్మకూరు: పార్టీ నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా వడ్డుపల్లి గ్రామానికి చెందిన నరసింహారెడ్డి, పార్టీ నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా వేపచెర్ల ఎగువ తండాకు చెందిన రమావత్ కృష్ణా నాయక్‌ను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ మండల కన్వీనర్ జొన్నగిరి బాలపోతన్న ఓ ప్రకటనలో తెలిపారు.

ఐక్యతతో కార్మిక హక్కుల సాధన



రాప్తాడు: సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం



అనంతపురం అర్బన్: జెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి



అన్నదానం చేస్తున్న అవోపా మహిళా విభాగం సభ్యులు

అనంతపురం అర్బన్: కార్మిక హక్కులను కేంద్ర, రాష్ట్ర పభుత్వాలు కాలరాస్తున్నాయని కార్మిక సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. కార్మిక చట్టాల పరిక్షణ, హక్కుల సాధనకు మే డే స్ఫూర్తితో సమైక్యంగా ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. మే డే సందర్భంగా గురువారం జిల్లా వ్యాప్తంగా వాడవాడాలా కార్యక్రమాలు నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు స్థానిక కృష్ణ కళామందర్ నుంచి లలిత కళాపరిషత్ వరకూ ర్యాలీ చేపట్టారు. సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడారు. సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో నిర్వహించిన మే డే వేడుకల్లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు నగర పాలక సంస్థ వద్ద నుంచి స్థానిక క్లాక్ టవర్ వరకు నిర్వహించిన ర్యాలీలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఎం, సీఐటీయూ, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు వెంకటనారాయణ, మత్తుజ, శ్రీనివాసులు, రామిరెడ్డి, ఆజామ్, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు శ్రీరాములు, లింగమయ్య, రమణ, అల్లీపీరా, కుల్లాయిస్వామి, కృష్ణుడు, వరలక్ష్మి, జయలక్ష్మి, ఖుర్షీదా, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాల ఉల్లంఘన

పాలకవర్గాలు అనుసరిస్తున్న విధానాల కారణంగా కార్మిక చట్టాలు ఉల్లంఘనకు గురైతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పబ్లిక్, ప్రైవేటురంగ సంస్థలు మరింతగా అదనపు శ్రమ విలువను దోపిడీ చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయన్నారు. దేశ రక్షణ, భద్రత కోసం ఈనెల 20న కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కార్పొరేట్ శక్తులకు ఊడిగం

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ధ్వజమెత్తారు. ప్రభుత్వరంగ సంస్థలను అదానీ, అంబానీలకు ధారాదత్తం చేస్తోందని దుమ్మెత్తి పోశారు. 75 ఏళ్ల కాలంలో కార్మికులు సుదీర్ఘ పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలకు మోదీ ప్రభుత్వం తూట్లు పొడిచి 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక హక్కులను కాలరాసిందన్నారు.

రాప్తాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సంఘటిత, అసంఘటిత కార్మికులు పోరాటానికి సన్నద్ధం కావాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించి, అంతర్జాతీయ కార్మికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

అన్నదానం..

అనంతపురం టవర్‌క్లాక్: కార్మికుల దినోత్సవం గురువారం అవోపా మహిళా విభాగం ఆధ్వర్యంలో నగరంలో అన్నదానం చేశారు. అవోపా మహిళా విభాగం అధ్యక్షురాలు గూడురు అనూరాధ, గీతాకుమారి, రామాదేవి, కాకుమాని చంద్రకళ, కృష్ణవేణి, గోపా లలిత, హరిప్రియ, రాజేశ్వరి, శ్యామల, పావిత్రి, మాధవి, నీరజ పాల్గొన్నారు.

అనంతపురం అర్బన్: కార్మిక దినోత్సవం సందర్భంగా గురువారం నగర పరిధిలో వాడవాడాలా మే డే కార్యక్రమాలను వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు నిర్వహించారు. సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో వివిధ కాలనీల్లో ఆ పార్టీ నగర కార్యదర్శి రామిరెడ్డి జెండా ఎగరవేసి కార్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. అదే విధంగా సీపీఐ నాయకుడు, చేతివృత్తిదారులు సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లింగమయ్య స్థానిక చాకలి ఐలమ్మ కాలనీలో జెండా ఆవిష్కరించారు. సీపీఎం నాయకులు ప్రకాష్, వలి, మసూద్, ఇర్ఫాన్, శీనా, జీవ, గపూర్, లక్ష్మినరసమ్మ, చంద్రిక, అశ్విని, సమాఖ్య నాయకులు హరికృష్ణ, నాగరాజు, బుసణ, నారాయణస్వామి పాల్గొన్నారు.


ఆత్మకూరు: మండల వ్యాప్తంగా గురువారం కార్మికుల దినోత్సవం జరుపుకున్నారు. ఆత్మకూరు ప్రధాన సెంటర్‌లో సీపీఎం, సీపీఐ పార్టీ జెండాలను ఆవిష్కరించారు. కార్మికులతో కలసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీ నేతలు శివశంకర్, సనప రామకృష్ణ, సావిత్రమ్మ, రాము, జయమ్మ, వలి తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడురూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం ఆగదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున స్పష్టం చేశారు. గురువారం అనంతపురం రూరల్ మండలం సోమలదొడ్డిలో రూరల్ సీపీఐ నాయకుడు రమేష్ ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ, రామాంజనేయులు, పోతులయ్య, జి.శ్రీకాంత్, దుర్గాప్రసాద్, వెంకటరాముడు శ్రీరామరెడ్డి, జి.శారద, అక్కులన్న, ఓబిలేసు తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం ఇటుకలపల్లి పంచాయతీ పరిధిలోని చిన్నకుంట లో గురువారం ఉపాధి కూలీలు మే డే వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకుడు, సీపీఐ నాయకులు నరేంద్ర, గంగయ్య, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

ధర్మానికి ప్రతిరూపం.. శంకర మఠం

సందర్భం: నేడు ఆది శంకరాచార్యుల జయంతి



అనంతపురం కల్చరల్: అద్వైత మత సంస్థాపనాచార్యులు ఆది శంకరాచార్యుల జయంతికి మఠాలు సిద్ధమయ్యాయి. హైందవ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా ఆది శంకర భగవత్పాదుల జీవిత ఆశయాలకు అద్దం పట్టేలా నగరంలో శారదానగర్‌లో శారదా శంకర మఠం దశాబ్దాల క్రితం నిర్మాణమైంది. మాజీ డీజీపీ రొద్దం ప్రభాకరరావు నేతృత్వంలో ఆరోజుల్లో తొలి శంకర మఠం ఏర్పడింది. కొన్నేళ్ల కిందట శృంగేరి పీఠం వారు దీనిని దత్తత తీసుకుని ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేస్తున్నారు. వేదపారాయణం నేర్చుకునే వారికి కల్పవల్లిగా శంకర మఠం బాసిల్లుతోంది. హైందవ ధర్మానికి ప్రతిరూపంగా నిలిచి మనస్సును ఆహ్లాదపరిచే విశాల ప్రాంగణంలో శైవ సంబంధిత పర్వదినాలు పెద్ద ఎత్తున ఇక్కడ జరుగుతాయి. శుక్రవారం ఉదయం శారదా శంకరులకు అభిషేకాలు, ప్రత్యేక ఉత్సవాలు, పల్లకీ సేవలు పెద్ద ఎత్తున చేపట్టేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

మొదటి రోడ్డు శంకరమఠంలో

మొదటి రోడ్డు శివాలయ ప్రాంగణంలో సనాతన భక్తి భావాన్ని మరింత పెంచుతూ మరో శంకర మఠం నిర్మాణమైంది. ఇందులో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటూ పలు సేవా కార్యక్రమాలు జరుగుతుంటాయి. అందులో భాగంగానే బ్రాహ్మణ ఉపనయన సేవ సంఘం వారు శంకర జయంతి నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకాలు పూజలు చేస్తారు. అనంతరం ఆలయ పరిసర వీధుల్లో నగరోత్సవం ఉంటుందని నిర్వాహకులు సాయి శివరాం, రఘురాం తెలిపారు. 10 గంటల నుంచి 35 మంది బ్రాహ్మణ వటువులకు ఉచితంగా సామూహిక ధర్మోపనయనాలు చేయిస్తున్నారు.

భక్తిమార్గంతోనే ఉత్తమ జీవితం



హారతి ఇస్తున్న గణపతి సచ్చిదానంద స్వామిజీ

రాప్తాడు: భక్తిమార్గంతోనే ఉత్తమ జీవితం సాధ్యమని మైసూర్ దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిజీ అన్నారు. గురువారం బొమ్మేపర్తి గ్రామంలో గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలో ఉదయం ప్రతిష్ఠాయాగం, అఖండ దీపారాధన, దీక్షాహోమం, ద్వారతోరణ పూజలు, వాస్తు హోమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన వేదపండితులు యజ్ఞహోమాలు జరిపించారు. అనంతరం దత్తపీఠాధిపతులు గణపతి సచ్చిదానంద స్వామిజీ, మైసూర్ దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థులు చేతుల మీదుగా లక్ష్మీ నరసింహ స్వామి విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేకం, నూతన నరహరీశ్వర స్వామి దేవాలయం ఆవిష్కరణ, పదహారు అడుగుల విశ్వరూప దత్తాత్రేయ స్వామి విగ్రహాన్ని ప్రారంభించారు. అనంతరం గణపతి సచ్చిదానంద స్వామి మాతృమూర్తి జయలక్ష్మీ మాతాజీ, నరహరతీర్థులకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. శుక్రవారం ఆశ్రమంలో జయలక్ష్మీ మాత జయంతి ఉత్సవాన్ని మైసూర్ దత్తపీఠాధిపతులు గణపతి సచ్చిదానంద స్వామిజీ చేతుల మీదుగా జరుగుతుంది. అలాగే శంకరాచార్య పూజ, శ్రీచక్ర పూజ, రుద్రహోమం, సాయంత్రం దివ్య నామ సంకీర్తన, తెప్పోత్సవం జరుగుతుందని ఆశ్రమ ట్రస్టీ బోయ తిరుపాలు, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వెంకటనాయుడు తెలిపారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత



జూటూరు నాగరాజు కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

రాప్తాడు: కష్టకాలంలో ఉన్నప్పుడు ఆదుకున్న వారే నిజమైన స్నేహితులు అని అనిపించుకున్నారు రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1997–98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన మాజీ సీనియర్ జర్నలిస్ట్ జూటూరు నాగరాజు గత నెల 2వ తేదీన అనారోగ్యంతో మృతి చెందాడు. తోటి మిత్రుడు అనారోగ్యంతో మరణించడంతో తోటి మిత్రులు ఒకరికొకరు తోడయ్యారు. రూ.54 వేలు వరకూ పోగు చేసిన మొత్తాన్ని గురువారం స్నేహితుడి భార్య చంద్రకళకు అందజేసి అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో కొండూరు మహేశ్, సురేష్, బెల్లం నాగ, మూష్టురు నాగభూషణ, ఆర్‌సీ నాగరాజు, హరి, గంగాధర్, నరసింహులు, పూజారి నాగ, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు

అనంతపురం టౌన్: లో ఓల్టేజీ సమస్యలను అధిగమించేందుకు విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. లో ఓల్టేజీ సమస్యలున్న ప్రాంతాలను ఇప్పటికే విద్యుత్ అధికారులు గుర్తించి నివేదికలను ఉన్నతాధికారులకు పంపడంతో అక్కడి నుంచి అడిషనల్ ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులను జారీ చేసినట్లు విద్యుత్ శాఖ ఎస్‌ఈ శేషాద్రి శేఖర్ తెలిపారు. నగరంలో 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 10, 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 15, అర్బన్ నియోజకవర్గ పరిధిలోని నాలుగు పంచాయతీలకు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 10 మంజూరైనట్లు తెలిపారు. రానున్న వారం రోజుల్లో వాటిని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. నగరంలో ఎక్కడ విద్యుత్ సమస్యలు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను 24గంటలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

ఉచిత సమ్మర్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం



కార్యక్రమానికి హాజరైన పోలీసుల పిల్లలు

అనంతపురం: పోలీసుల పిల్లలకు నెల రోజుల పాటు ఉచిత సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ ఎస్పీ డీవీ రమణ మూర్తి సూచించారు. గురువారం పోలీసు ఇండోర్ స్టేడియంలో ఉచిత సమ్మర్ కోచింగ్ క్యాంపులో భాగంగా చెస్, షటిల్, పియానో, డ్రాయింగ్, హ్యాండ్ రైటింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు, ఆర్‌ఐలు మధు, పవన్ కుమార్, టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్, ఆర్‌ఎస్‌ఐ బాబ్ జాన్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, గాండ్ల హరినాథ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

- హత్యాయత్నం కేసు నమోదు



చికిత్స పొందుతున్న షాజహాన్

అనంతపురం: నగరంలో ఓ వ్యక్తిపై మహిళ దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. అనంతపురం నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ కే.సాయినాథ్ తెలిపిన మేరకు వివరాలు.. పాపంపేట, విద్యారణ్య నగర్, ఉర్దూ స్కూల్ సమీపంలో నివాసం ఉన్న సయ్యద్ ఇస్మాయిల్ రెండో కొడుకు షాజహాన్, హిందూపురం పట్టణం ముద్దిరెడ్డిపల్లికి చెందిన ఈశ్వరమ్మ మూడు సంవత్సరాలుగా సహజీవనం చేస్తున్నారు. గతంలో షాజహాన్‌కు తాడిపత్రికి చెందిన సపోరాతో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె సంతానం. ఆరు సంవత్సరాల క్రితం భార్యాభర్తలు విడిపోయారు. షాజహాన్‌కు ఈశ్వరమ్మతో పరిచయం ఏర్పడటంతో కోవూర్ నగర్‌లో ఇమ్రాన్ మసీదు వద్ద ఒక బాడుగ ఇంట్లో సహజీవనం చేస్తున్నారు. వీరికి 14 నెలలు వయస్సు ఉన్న హమీల్ బాబా అనే కొడుకు ఉన్నాడు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా షాజహాన్ పెద్ద కుమారుడు షాజహాన్ వద్దకు వచ్చి వెళ్తుండటంతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. షాజహాన్ బుధవారం రాత్రి మద్యం సేవించి ఈశ్వరమ్మతో గొడవపడ్డాడు. ఈశ్వరమ్మ రోకలి బండతో షాజహాన్‌పై తలపై బాదింది. షాజహాన్ తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. షాజహాన్ తండ్రి సయ్యద్ ఇస్మాయిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈశ్వరమ్మపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

పామిడి: మండలంలోని గజరాంపల్లి సమీపంలో ఓ కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఘటనలో బెంగళూరుకు చెందిన పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. బెంగుళూరు నుంచి మంత్రాలయానికి బయలుదేరిన కారు (కేఏ01ఎంజే 8536) గజరాంపల్లి సమీపంలోకి చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో డివైడర్‌ను ఢీకొని ధ్వంసమైంది. కారులో ప్రయాణిస్తున్న సువర్ణ, జయమ్మ, శశికుమారు గాయపడ్డారు. స్థానికులు అప్రమత్తమై క్షతగాత్రులను వెంటనే 108 వాహనంలో గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పామిడి పోలీసులు కేసు నమోదు చేశారు.